మయకోవ్‌స్కీ

నేను ఏమవాలి?



"ప్రగతి" ప్రచురణాలయం • మాస్కో

వయస్సేమో పరుగెడుతోంది
వచ్చేస్తున్నయ్ పదిహేడేళ్ల
ఎక్కడైన పనిచెయ్యాలి
ఏం పని చెయ్యాలి?

వడ్రంగిని నే కావాలి
వస్తువు లెన్నో తేవాలి.
చెక్కలు ముక్కలు సేకరించుకొని
చక్కగ చిత్రిక పట్టాలి.
నాణ్యమైన నగిషీపనులు
నలుగురు మెచ్చగ చేయాలి.
మొద్దు మాను నొకటి
ముందుగ మేము తెస్తాం:
నిటారైన పొడవాటి పలకలుగ
నేర్పుగ దానిని కోస్తాం.



రాపిడి వేడికి బాగా
రంపం పదునెక్కింది.
రంపం కోతకు బాగా
రజం కుప్పగా రాలింది.
ఇదిగో ఇట్లా పలకలు,
ఈ చిత్రిక బల్ల కమర్చాలి.



చిత్రిక అనేది చేతబట్టితే
చేసే ఆ పని తీరే వేరు!
తరివెణ బట్టిన చెక్కలు
తమాషా ఆట ముక్కలు!
అవసరమైతే గుండ్రపు బంతిని
అప్పటి కప్పుడు తయారు చేస్తాం.
ఇంకా ఇంకా ఎన్నో చేస్తాం —
మేజా బల్లలు పెట్టెలూ —
మేలి రకపు కుర్చీలూ.

బాగుందీ వ్రడంగి పని
ఇంజనీరు పని ఇంకా బాగు.
ఇంజనీరు నే నవుతాను
నేర్చుకోనీయండి
నన్నూ.
మొదట గీస్తా
ప్లాను
ముచ్చటగా నిర్మిస్తా
ఇల్లు.
అంతటిదీ ఇంతటిదీ
అన్ని హంగులూ గల ఇల్లు!
తయారైనది ప్లాను
తళతళలాడే ప్లాను!
ఇది ప్రహారీ! ఇది తోటా!
ఇదిగో ఇది స్నానాల గది!
దేని కదే విడిగా
తీర్చిదిద్ది నట్లుందంగా
తయారైంది ప్లాను!
వందలు పనులూ, వేయి చేతులూ
అగుపిస్తున్నయి అన్నివైపులా!
ఆకాశంలో అంత ఎత్తున
అంటి ఉన్నవీ సర్వీకొయ్యలు!

కష్టమైన పని ఎక్కడ వుందో
క్రేనులక్కడ కనిపిస్తున్నాయి.
దూలాలన్నీ బెండుల్లాగా
చాలా సులువుగ పై కెళుతున్నాయి.
మూసపోసినా ఇటుకలు అన్నీ
మోసుకు రావాలి.
పై కప్పు మీద తగరం లాదు
పకడ్బందిగా వేయాలి.
నాలుగు పక్కల
నవ కాంతులతో
బాలల కోసం సువిశాలంగా
చక్కటి ఇల్లు,
చాలా పెద్దది
తయారైన
దిప్పటికి.



బాగుందీ — ఇంజనీరు పని
డాక్టరు పని అది ఇంకా బాగు.
డాక్టరు నే నవుతాను
నేర్చుకోనీయండి
నన్నూ.
పేత్య వద్ద కెళతాను
పోల్య వద్ద కెళతాను
ఏమ్రా అబ్బాయిలూ
ఎవరికి మీలో జబ్బులు?
ఉదరాలెట్లా ఉన్నాయీ?
ఉండండీ నే పరీక్షచేస్తా.
కళ్ళజోడు నే కాస్త సర్దుకొని
పిల్లల నాల్కలు పరిశీలిస్తా.

సంతోషంగా ఈ జ్వరమానిని
చంకల్లో ఉంచండీ.
    చంకల్లో ఉంచారా
    సంతోషంగా జ్వరమానిని?
బలే రుచిగ ఉంటుందిలె
          ఈ
ఫలచూర్ణం మింగండీ.
మందును చెంచాతో లోనికి
మాట్లాడక పోనీయండీ.
    పొట్ట మీద ఆ కట్టు హోయి!
    పడక మీద నిద్రించుట హోయి
    బతుకుతావు నూరేళ్లు భాయి!

బాగుందీ డాక్టరు పని
ఇంకా బాగు కార్మికుడి పని.
కార్మికుణ్ణి నే నవుతాను
నేర్చుకోనీయండి

నన్ను.

అదుగో సైరన్ వినిపిస్తోంది
అచటికి రమ్మని కేకేస్తోంది.

గుంపులు గుంపులుగా అంతా
కూడి జట్టుగా వెళదాం మనం!
వేయిన్నొక్కరుగా కలిసి,

ఒకడు

చేయలేని పని చేద్దాం మనం.



ఇనుము
ముక్కలుగ కత్తిరిస్తాం.
ఎంతో సులువుగ క్రేనులతో
పై
కెత్తరాని బరువెత్తేస్తాం.
ఇనప పట్టాలు గడ్డిపోచలటు
సమ్మెట్లతో వంచేస్తాం
తగరం కాచీ, ద్రవింపజేసీ,
తయారు చేస్తాం యంత్రాలు!





పని అందరిదీ సమానమే.
మన మందరమూ సమానమే.
మరలు నేను చేస్తా, మరి
మర చీలలు నువు చెయ్.
విడి విడి పను లందరివీ
వడి వడి చేరును ఒక చోటుకి.

సరిగా చూచీ రంధ్రాలన్నీ
మర బోల్టులతో
విడిభాగాలు
బిగించండొకటిగా
పెద్ద యంత్రముగా.
అక్కడ పొగనూ
ఇక్కడ రొదనూ
కలగాపులగం చేసేస్తాం
కార్ఖానా నింపేసేస్తాం.
నిన్నూ నన్నూ ఎందరినో
మోసుకు పోయే ధూమ శకటం
కన్నావా ఇదె తయారైనది!



బాగుందీ — కార్ఖానా పని
ట్రాము బండిలో కండక్టరుగా
పనిచేయుట అది ఇంకా బాగు.
కండక్టరు నే నవుతాను
నేర్చుకోనీయండి
నన్నూ.
ప్రతి దినమూ ఒక తోలుసంచితో
పరిసరాలలో పయనిస్తా:
ట్రాంబండిలో ప్రయాణమంటే
సంబర మని నే భావిస్తా.
ఎన్నో రంగుల టిక్కెట్లు!
ఎర్రవి పచ్చవి నీలపువి!
ప్రప్రథమంగా పుచ్చుకోనండి
ప్రయాణీకులకు కావలసినవి.
పట్టాలుంటే పరుగిడు బండి
పట్టా లిక్కడ ఆగినవండి
చుట్టూ అడవి; దిగండి బండి.
అదిగో నండి; చలి కాగండి.



బాగున్న దీ కండక్టరు పని
ఇంకా బాగు డ్రైవరు పని!
డ్రైవరు నే నవుతాను
నేర్చుకోనీయండి
నన్నూ.

అతివేగంగా ఈ బండి
అదుగో దూసుకు పోతోందండి,
సాగిందంటే ఈ బండి
ఆగడ మనేదే లేదండి.
చెప్పం డెక్కడి కెళ్లాలి?
చేరుస్తుందతి శీఘ్రంగా
పట్టాలేవీ లేకుండానే
ప్రయాణీకులను భద్రంగా.

పదండి పోదాం గమ్యస్థానం
పక్కకు తొలగండిదె ప్రస్థానం.



బాగున్న దీ డ్రైవరు పని
ఇంకా బాగు పైలట్ పని.
పైలట్టును నే నవుతాను
నేర్చుకోనీయండి
నన్నూ.
టాంకులో పెట్రోలు పోస్తూ
ప్రొపెల్లరేమో తిప్పేస్తూ
పిట్టల పాటల రొద జేస్తూ
అట్టె పైకెగురుతుందీ విమానమూ.

మబ్బుల చుట్టే
ప్రయాణమైనా
భయపడబోదు
ఇసుమంతైనా
వానా లేదు ఉరుమూ లేదు
అందుకె నాలో భయమే లేదు.



ఒక్క చిటికెలో, కొండను చుట్టీ.
చుక్కలదాకా చంద్రుడిదాకా
చక్కగ ఎంతో పైకెగిరేస్తా
దిక్కులు నాలుగు తిరిగేస్తా.

బాగుందీ పైలట్ పని
ఇంకా బాగు నావికుడి పని!
నావికుడిని నే నవుతాను
నేర్చుకోనీయండి
నన్నూ.
ఎండా కాలం సముద్రాలపై
ఎంతో హాయిగ విహరిస్తాను.
దూకు తున్నవీ తుంటరి అలలు
తోవ సాగి పోనీకుండ
వ్యర్థంగా నా దారికి
అవి
వస్తున్నా యడ్డంగా.
తెరచాప కమర్చిన కర్ర
బిరబిర, కొస కెక్కేస్తానర్రా
నిచ్చెన మీదుగ నిడివికి పాకి
అచ్చం పిల్లి లాగయ్యేద నర్రా.



దక్షిణ వాయు, దరిద్ర తుఫాను
పొండీ పొండీ పొండీ!
కనిపెడతా నే దక్షిణధ్రువాన్ని.
కనిపెడతా నే ఉత్తరధ్రువాన్ని.

పుస్తకాల పుటలు మూసి
మస్తకాల తలుపు తెరచి
''అన్ని పనులు మంచివ''నే
ఆ సత్యం తెలుసుకో.
నీ అభిరుచి కనువైనది
నీవె నిర్ణయించుకో.